క్లుప్తంగా

12న మండల సర్వసభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.జగదీష్‌కుమార్ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో జై గురుదత్త హోమం



హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి బాబా మందిరంలో జై గురుదత్త హోమం భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పలు పూజా కార్యక్రమాల అనంతరం యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీనివాసరావు హోమం చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. పెద్దూరు, గరుగుబిల్లి, హిక్కింవలస, ఉద్దవోలు, రావుపల్లి, బి.వి.పురం తదితర గ్రామాల నుంచి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన డీఎస్పీ



ఆర్డీఓకు మొక్క బహుకరిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ: పాలకొండ రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణను డీఎస్పీ కృష్ణారావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పరిస్థితులపై ఆయనతో చర్చించారు.

డైరీ ఆవిష్కరణ



డైరీలు ఆవిష్కరిస్తున్న అధికారులు

బలిజిపేట: పంచాయతీరాజ్ మినిస్టీరియల్ జిల్లా శాఖ డైరీలు, క్యాలెండర్లు, స్టిక్కర్లను ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, అధికారులు ఆవిష్కరించారు. బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రవికుమార్ మాట్లాడుతూ డైరీలలో మంచి సమాచారాన్ని పొందుపరచారని, ఇది ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు, ఎంఈఓ-1 సామల సింహాచలం, ఏఓ భానుమూర్తి, యూనియన్ ప్రతినిధి విక్టర్, టైపిస్ట్ శ్రీనివాస్, నాయకులు వెంకటరమణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నవనీతాలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి



నవనీతం అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నది సమీపంలో వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి నవనీతం అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనృశింహస్వామి వారిని ఆలయ ప్రధాన అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు గురువారం వేకువజాము నుంచి స్వామివారిని వెన్నతో అలంకరించి వివిధ రకాల పూలతో అలంకరణ చేసిన అనంతరం భక్తుల దర్శనార్థం అనుమతి నిచ్చారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పూజలు జరిపించారు.

గృహ నిర్మాణ సంస్థ క్యాలెండర్ ఆవిష్కరణ

పార్వతీపురం టౌన్: రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ రూపొందించిన డైరీని హౌసింగ్ పీడీ రమేష్ గురువారం స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ డైరీలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గృహ నిర్మాణాలకు సంబంధించి వివరాలు పూర్తి స్థాయిలో నిక్షిప్తమై ఉంటాయని పేర్కొన్నారు. ఉద్యోగులకు ఈ డైరీ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్య నిర్వాహక ఇంజినీరు మోహనరావు, జి.సోమేశ్వరరావు, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల వద్దు.. ఒకేచోట ముద్దు



వీరఘట్టం:

పక్క చిత్రంలో ఉన్నది వీరఘట్టాం కూరాకుల వీధి స్కూల్‌లోని 250 నంబర్ పోలింగ్ కేంద్రం. ఈ పోలింగ్ కేంద్రంలో ప్రస్తుతం 928 మంది ఓటర్లు ఉన్నారు. ఇదే స్కూల్‌లో ఉన్న 251 పోలింగ్ కేంద్రంలో 736 మంది ఓటర్లు, 252 పోలింగ్ కేంద్రంలో 642 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం కలిసి ఈ పాఠశాలలో 2306 మంది ఓటర్లు ఓటు వేయనున్నారు. అయితే గదిలోనుంచి బయటకు వచ్చేందుకే ఒకటే ద్వారం ఉండడం, గదులు కూడా ఇరుకుగా ఉండడంతో గత ఎన్నికల్లో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఓటింగ్ కూడా నత్తనడకన సాగింది.

- ఆ పోలింగ్ కేంద్రాల్లో 2019లో ఇబ్బంది పడిన ఓటర్లు
- వీరఘట్టం పట్టణంలోని ఓటర్లు 11,144 మంది
- ఒకే చోట పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు
- అవకాశం ఉన్నప్పటికీ వేర్వేరు చోట్ల పోలింగ్ బూత్‌లు



పక్క ఫొటోలో ఉన్నది వీరఘట్టం కోమటివీధి పాఠశాలలోని 261వ నంబర్ పోలింగ్ కేంద్రం. ఇక్కడ 729 మంది ఓటర్లున్నారు. ఇక్కడకు ఓటేసేందుకు వచ్చేవారు పక్కనే ఉన్న రోడ్డుపై క్యూలో నిలబడాల్సి ఉంటుంది. ఇలా వీరఘట్టం మేజర్‌పంచాయతీలో ఏర్పాటు చేసిన 13 పోలింగ్ కేంద్రాల్లో చాలా సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను అధికారులు గుర్తించలేకపోవడంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఇబ్బందులు తప్పేటట్లు లేవని పట్టణ ప్రజలు అంటున్నారు.

వీరఘట్టం మేజరుపంచాయతీలో 13 పోలింగ్ కేంద్రాలున్నాయి. ప్రస్తుతం ఈ కేంద్రాల పరిధిలో 11,144 మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి ఓటరూ స్వేచ్ఛగా ఓటు వేసేందుకు అన్ని మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెబుతోంది. అయితే వీరఘట్టం పట్టణంలో అందుకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది.

ఇదీ పరిస్థితి....

వీరఘట్టం మేజర్ పంచాయతీలో ఉన్న 16 వార్డుల్లో 13 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వేర్వేరు వీధులలో ఈ పోలింగ్ కేంద్రాలు ఉండడంతో గత ఎన్నికల సమయంలో వీటి పర్యవేక్షణ ఇటు అధికారులకు అటు పోలీసులకు ఇబ్బందిగా మారింది. కొన్ని కేంద్రాల వద్ద తగాదాలు కూడా జరిగాయి.

పరిష్కారం ఇలా..

వీరఘట్టం బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో విశాలమైన గదులు, ప్రహరీతో కూడిన క్రీడా మైదానాలున్నాయి. అన్ని గదుల్లో మౌలిక సదుపాయాలు కూడా ఉన్నాయి. గతంలో ఇక్కడ స్థానిక ఎన్నికలను ఎంతో ప్రశాంతంగా నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలంటే వీరఘట్టంలో ఉన్న 13 పోలింగ్ కేంద్రాలను బాలుర, బాలికోన్నత పాఠశాలల వద్ద ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే ప్రభుత్వ ధ్యేయం.అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. వీరఘట్టంలోని 16 వార్డులో 13 పోలింగ్ కేంద్రాలను వేర్వేరు చోట్ల ఏర్పాటు చేశాం. పోలింగ్ కేంద్రాలన్నీ ఒకే చోట ఉంటే మాకు కూడా పర్యవేక్షణ సులువవుతుంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

కె.జయప్రకాష్, తహసీల్దార్, వీరఘట్టం

రక్త పరీక్షలు నిర్వహించాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: నలభై సంవత్సరాల్లోపున్న ప్రతి ఒక్కరికీ సికిల్‌సెల్ ఎనీమియా రక్త పరీక్షలు నిర్వహించాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. మండలంలోని కుశిమి పీహెచ్‌సీని గురువారం ఆమె సందర్శించారు.

ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలతో సమావేశమై రక్త పరీక్షల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఇంకా గ్రామాలు, పాఠశాలల్లో టెస్టులు చేయించుకోని వారిని గుర్తించి పరీక్షలు చేపట్టాలన్నారు. ప్రతిరోజూ టెస్టుల రిపోర్టులను ఐటీడీఏ కార్యాలయానికి అందజేయాలన్నారు. అనంతరం హడ్డుబంగి, కె.గుమ్మడలలోని విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

గరుగుబిల్లి: అధికారులంతా సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య, ఐసీడీఎస్ సిబ్బందితో గురువారం సమావేశమైన ఆయన గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని, ఆ నిధులతో గ్రామాల సమగ్రాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సిబ్బందిని కోరారు. ప్రజలు సేవలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, వైద్యులు సాగర్ వర్మ, కె.కార్తీక్, ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు



వంటకాలు పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

కురుపాం: మండల కేంద్రంలోని విద్యార్థులకు చెందిన పలు వసతిగృహాల్లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. మెనూ ప్రకారం వంటకాలు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత సాంఘిక సంక్షేమ బాలురు వసతిగృహాన్ని సందర్శించిన ఆయన ఆ తర్వాత వరుసగా బీసీ వసతిగృహాన్ని, జ్యోతీబాపూలే గురుకుల బాలురు ఆశ్రమ పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలురు పాఠశాలకు వెళ్లి, అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. ఈ క్రమంలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనం వంటకాలను రుచి చూశారు. వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, ప్రతిరోజూ మెనూ ప్రకారం వంటకాలు చేయాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే సాంఘిక సంక్షేమ వసతిగృహ సంక్షేమ అధికారికి మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ డీడీలు, డీఎస్‌వో శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలపై దృష్టి సారించండి



చిన మంగళాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యుటీ ఈఓ కృష్ణమూర్తి

పాలకొండ రూరల్: ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందిస్తున్న శిక్షణలు సద్వినియోగపరుచుకుంటూ తరగతి గదిలో మెరుగైన బోధన అందించాలని డిప్యుటీ ఈఓ పి.కృష్ణమూర్తి అన్నారు. అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన మంగళాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను లెర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రామ్ (లిప్) బృంద సభ్యులతో కలసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేశారు. అలాగే పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథక తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం జామి రవితో పాటు లిప్ సభ్యులు అప్పికొండ రాంబాబు, బౌరోతు మల్లేశ్వరరావు, తామాడ సూర్యనారాయణ, టి.అనిల్‌కుమార్, తదితరులున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

సీతానగరం: ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో చేపట్టిన సీసీ కాలువలు, రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి అన్నారు. లచ్చయ్యపేట ఎస్సీ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. మండలంలో జరుగుతున్న పనుల పరిశీలన అనంతరం ఏఈ చంద్రమౌళి మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులు, కాలువలు లేని చోట ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వినతులు రావడంతో ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టులు, సీసీ కల్వర్టులు నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి దశల వారీగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇంజినీరింగ్ సహాయకుల పర్యవేక్షణలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు.

ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి

పాలకొండ రూరల్: విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని పునాది అక్షరాస్యత సంఖ్యా శాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) బృంద రాష్ట్ర సభ్యుడు పొండు రంగారావు అన్నారు. మండలంలోని ఎం.సింగుపురం ఎంపీపీ పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఒకటి, రెండు తరగతి విద్యార్థుల సామర్థ్యంపై ఆరా తీశారు. విద్యార్థుల అభ్యసనాస్థాయి పెంపుదలకు అనుసరించాల్సిన సూచనలపై హెచ్‌ఎం టీఎస్ శివాజీకి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర కోఆర్డినేటర్ కె.అశోక్, ఉపాధ్యాయులు కేసీహెచ్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాల పరిశీలన

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను మండల స్థాయి లిప్ మానటరింగ్ టీమ్ గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆరు నుంచి ఎనిమిది తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. టీచింగ్, ప్రాక్టీస్ పీరియడ్‌ల నిర్వహణపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల మరణాల రేటు తగ్గించాలి



నులిపురుగుల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించిన అధికారులు

బలిజిపేట: ఏడాదిలోపు చిన్నారులు, మాతా, శిశు మరణాల రేటు తగ్గించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రమేష్‌నాయుడు అన్నారు. తన కార్యాలయంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలోపు చిన్నారుల మరణాల రేటు తగ్గేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. మాతా, శిశు మరణాల రేటు తగ్గేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అందుకు గాను పంచాయతీరాజ్, ఐసీడీఎస్, వైద్యశాఖలు సంయుక్తంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, ఎంఈఓ-1సామల సింహాచలం, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరరావు

సీతానగరం: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించడానికి పాల్గొనే సమయంలో వారికి అవసరమైన సదుపాయాలను కల్పించడానికి నివేదికలు అధికారులు తయారు చేయాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. ఎంపీడీఓ చాంబర్‌లో రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. ఎంపీడీఓ ఈశ్వరరావు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, దివ్యాంగులకు అవసరమైన ర్యాంప్‌లు, తాగునీటి సౌకర్యం, రహదారి సౌకర్యం, పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు, వృద్ధులకు రహదారి సౌకర్యాలు కల్పించడానికి ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు సెక్టోరియల్ అధికారులను నియమించడం వలన ఇప్పటి నుంచే పోలింగ్ కేంద్రాల వివరాలను సేకరణలో ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓపీఆర్ఆర్డీ కె.కుమావర్మ, రీసర్వే డీటీ పి.చిట్టెమ్మ, ఆర్‌అండ్‌బీ ఏఈ రామ్మోహనరావు పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో జీసీసీ వ్యాపార లావాదేవీలు

- జీసీసీ పార్వతీపురం డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్



మాట్లాడుతున్న జీసీసీ పార్వతీపురం డివిజనల్ మేనేజర్ మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: జీసీసీ(గిరిజన సహకార సంస్థ) వ్యాపార లావాదేవీలు లక్ష్యానికి చేరువలో ఉన్నాయని జీసీసీ పార్వతీపురం డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ తెలిపారు. గురువారం స్థానిక జీసీసీ బ్రాంచి కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకరులతో కాసేపు మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో డివిజనల్ పరిధిలో రూ.56 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని లక్ష్యంగా చేసుకున్నామని, ఇప్పటివరకు పెట్రోల్‌బంకులు, గ్యాస్‌గొడౌన్‌లు, డీఆర్ డిపోలు, కొనుగోలు కేంద్రాలు, సూపర్‌బజార్ల ద్వారా రూ.52 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహించడం జరిగిందన్నారు. మరో రెండు నెలల్లో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. అటవీ ఉత్పత్తులకు మద్దతుధరలు నిర్ణయించి, కొనుగోలు చేస్తున్నామన్నారు. పిక్కతో కూడిన చింతపండు కిలో రూ.32.40 రూపాయలకు, పిక్కతీసిన చింతపండు కిలో రూ.63, కాగుపప్పు కిలో రూ.22, ముషిడి గింజలు కిలో రూ.90, కరక్కాయలు కిలో రూ.18, విప్పపప్పు కిలో రూ.29, నల్లజీడి గింజలు కిలో రూ.18, కుంకుడు కాయలు కిలో రూ.60, ఇండుగ పిక్కలు కిలో రూ.60, తానికాయలు కిలో రూ.15, ఉసిరిపప్పు కిలో రూ.90, నరమామిడి చెక్క కిలో రూ.18 ప్రకటించి కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ బ్రాంచి మేనేజర్ కృష్ణప్రసాదరావు, గొడౌన్ ఇన్‌చార్జ్ ఎం.సాంబశివరావు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి



ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కురుపాం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జ్యోతీబా పూలే, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు లలిత, రామ్మోహన్‌రావు, మురళీకృష్ణ, రామకృష్ణ, ఎల్లంనాయుడు, నిర్మలాజ్యోతి, స్వప్న, సతీష్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆయా పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు, కోర్సులు, విద్యాబోధన, సదుపాయాలపై అవగాహన కల్పించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారంతా వచ్చే ఏడాది ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులను ప్రభుత్వం ఎన్నో విధాలుగా ప్రోత్సహిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

కురుపాం: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై గురువారం అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ మాట్లాడుతూ వాహనాలతో రోడ్లపైకి వచ్చే ప్రతిఒక్కరూ లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలన్నింటినీ వెంట తీసుకురావాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటుబెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను వాహనాల్లో ఎక్కించవద్దని, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. అలాగే పాదచారులు రోడ్డుకు ఎడమవైపు మాత్రమే నడవాలని, రోడ్డు దాటేటప్పుడు జీబ్రాక్రాసింగ్ వద్ద మాత్రమే దాటాలని తెలిపారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియామాలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. అనంతరం రహదారి భద్రతా నియమాల ప్రతిజ్ఞ చేయించారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

గరుగుబిల్లి: డీవార్మింగ్ డే సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగు నివారణ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి కె.కె.సాగర్‌వర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 5 ఏళ్ల వయసు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, 6 నుంచి 19 ఏళ్ల వయసు విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలల్లో మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. భోజనం చేసిన తర్వాత ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవని, మాత్ర వేసిన తర్వాత ఏదైనా సమస్య ఉత్పన్నమైతే స్థానిక ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఒకటి, రెండేళ్ల వయసు చిన్నారులకు అరమాత్ర మాత్రమే గుండగా చేసి, ఇవ్వాలన్నారు. 2 నుంచి 19 ఏళ్ల విద్యార్థులు ఒకమాత్రను పూర్తిగా నమిలి మింగేలా చూడాలన్నారు. రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కూడా ఏర్పాట్లు చేసినట్లు వైద్యాధికారి కె.కార్తీక్ తెలిపారు.

ఆర్డీఓ దృష్టికి కౌలురైతుల సమస్యలు



ఆర్డీఓకు కౌలు రైతుల సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘాల నాయకులు

పాలకొండ రూరల్: కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు ఆర్డీఓ వెంకటరమణను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కౌలురైతులకు సంబంధించి రూ. 2 లక్షల మేరు రుణాలను మాఫీ చేయాలన్నారు. సాగుసాయం కింద ఎకరాకు రూ. 15 వేలు అందించాలని.. తోటపల్లి కాలువల ఆధునీకీకరణ పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని కోరారు. జీడి, మామిడి రైతులకు సరైన మద్దతు ధర అందించాలని కోరారు. ఆర్డీఓను కలిసిన వారిలో రైతు సంఘాల నాయకులు గురుబిల్లి అప్పలనాయుడు, కిమిడి రామ్మూర్తినాయుడు, మజ్జి సన్యాసినాయుడు తదితరులున్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణకు భరోసా



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ, పలు శాఖల అధికారులు

పాలకొండ రూరల్:

తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణకు అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది అంకితభావంతో భరోసా కల్పించాలని ఎంపీడీఓ పైడితల్లి అన్నారు. గురువారం తన కార్యాలయ ప్రాంగణంలో అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది, ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, నవజాత శిశువుల మరణాలను శతశాతం అదుపు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఏ ఒక్కరూ పౌష్టికాహారం లోపంతో ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. సమావేశంలో వైద్యులు వి.కమల్‌నాథ్, ఎస్.రవికుమార్, సీడీపీఓ సిమ్మాలమ్మ, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.